క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న గ్రామస్తులు

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస గ్రామంలో కొత్తగా శివాలయం నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి తదితరులు కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో లెంక సూర్యనారాయణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



అట్టలు,పెన్నులను అందుకుంటున్న విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని ఆర్తమూరు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు విజయగౌరి యువజన సేవా సంఘం అధ్యక్షుడు పిల్ల సుధాకర్ ఉపాధ్యాయుల చేతుల మీదుగా శనివారం అట్టలు, పెన్నులు అందజేశారు. పరీక్షలు బాగా రాయాలని సూచించారు.

26 మందికి స్వర్ణ పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శాంతి మహంతి

శృంగవరపుకోట: ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీల్లో స్థానిక కౌముది గ్లోబల్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 70 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, ఐదుగురికి అంతర్జాతీయ స్థాయిలో ఐదుగురు, జిల్లా స్థాయిలో 21 మంది స్వర్ణ పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శాంతి మహంతి శనివారం తెలిపారు.

కేజీబీవీలో డిజిటల్ ల్యాబ్ సదుపాయం



డిజిటల్ ల్యాబ్ ప్రయోజనాలను తెలియజేస్తున్న ఎంఈఓ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో (కేజీబీవీ) ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన డిజిటల్ ల్యాబ్‌ను ఎంఈఓ పి.రామారావు శనివారం ప్రారంభించారు. డిజిటల్ ల్యాబ్ వల్ల కలిగే ఉపయోగాలను బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ.ధనలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద వేతనదారులకు సైబర్ నేరాలు-వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకుల మీద క్లిక్ చేయవద్దని, ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దని ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపారు. అలాగే లోన్‌యాప్‌లను ఆశ్రయించవద్దన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని తన నివాసంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం అందజేశారు. ఎస్.కోట, వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస మండలాలకు చెందిన 19 మందికి మొత్తం రూ.12,98,769లు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని, ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆరోగ్య తనిఖీలు

వేపాడ: మండలంలోని గిరిశిఖర గ్రామమైన మారిక గ్రామంలో వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చే రోగులకు ఆస్పత్రి వైద్యులు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, వైద్యుడు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరాయిపంచన.. ఇంకెన్నాళ్లు?

- అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- వియ్యంపేట ప్రాజెక్టు పరిధిలోని 131 కేంద్రాలూ పరాయిపంచనే..
- కనీస సదుపాయాల్లేక అవస్థలు పడుతున్న చిన్నారులు
- గతంలో మంజూరైన భవనాలకు బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం
- అర్ధాంతరంగా నిలిచిన భవన నిర్మాణ పనులు



ఎల్.కోట మండలం, రొంగళివానిపాలెంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం



లక్కవరపుకోటలో అద్దె భవనంలో నడుపుతున్న అంగన్‌వాడీ కేంద్రం

లక్కవరపుకోట: అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తుండడంతో అక్కడుండే అరకొర సదుపాయాలతో అటు అంగన్‌వాడీ సిబ్బంది, ఇటు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సొంత భవనాలు ఉంటే అందులోనే పక్కా వసతులు ఉంటాయని, అప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకునేందుకు వీలుంటుందని అంతా అభిప్రాయపడుతున్నారు. వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ శిథిల భవనాలు, అద్దె భవనాల్లో వాటిని నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. మరికొన్ని భవనాలకు విద్యుత్ సౌకర్యమూ లేదు. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు రానిచోట పిల్లలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఇదంతా చూస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు ఇంకెన్నాళ్లు పరాయిపంచన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన భవనాలను అయినా నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అరకొర వసతులుండే భవనంలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

నివేదికలు ఇచ్చాం..



వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు సంబంధించి, నివేదికలు ఉన్నతాధికారులకు ఇచ్చాం. ఆయా నిర్మాణాల బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. సొంత భవనాలు లేకపోవడంతో అటు సిబ్బంది, ఇటు పిల్లలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే.

– రొంగళి ఉమాదేవి, వియ్యంపేట ఐసీడీఎస్ పీవో

అద్దె భవనాల్లో 88.. శిథిల భవనాల్లో 43..

వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలాల్లో మొత్తం 226 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే కొత్తవలస మండలంలోని 37 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. అద్దె భవనాల్లో మరో 34 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇంకో 13 కేంద్రాలను పాడుబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో నడుపుతున్నారు. లక్కవరపుకోట మండలంలోని 31 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 19 కేంద్రాలు అద్దె భవనాల్లోను, ప్రభుత్వ శిథిల భవనాల్లో 18 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వేపాడ మండలంలోని 27 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మరో 35 కేంద్రాలు అద్దె భవనాల్లో.. పాత భవనాల్లో మరో 12 కేంద్రాలు నడుపుతున్నారు. ఈ లెక్కన మొత్తం 95 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 88 కేంద్రాలు అద్దె భవనాల్లో, మరో 43 కేంద్రాలు పాడుబడిన ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు.

ఎన్నికల రాకతో నిలిచిన నిర్మాణాలు..

అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి గమనించిన అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా కొత్తవలస మండలానికి 10, లక్కవరపుకోట మండలానికి 07, వేపాడ మండలానికి 07 భవనాలను మంజూరు చేసింది. అప్పట్లో వాటి నిర్మాణాలు కూడా శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిర్మాణాలు అలానే నిలిచిపోయాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణాల పూర్తిపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా నిర్మాణాలు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

‘ప్రజాచైతన్య యాత్ర’



శృంగవరపుకోట: కొండమల్లిపూడి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు



బొండపల్లి: ప్రజాచైతన్య యాత్రలో భాగంగా కనికమెర గ్రామంలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం చేపడుతున్న ప్రజాచైతన్య యాత్ర.. బొండపల్లి, శృంగవరపుకోట మండలాల్లో శనివారం జరిగింది. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గొర్లె శ్రీనివాస్.. బొండపల్లి మండలంలోని కనిమెరక గ్రామానికి వెళ్లి, అక్కడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు నెలలుగా ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇళ్లు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదన్నారు. తాగునీరు కూడా అందివ్వడం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా, శృంగవరపుకోట మండలంలోని కొండమల్లిపూడి, కాశీపతిరాజపురం గ్రామాల్లో ఆ పార్టీ నేత గాడి అప్పారావు తదితరులు పర్యటించి, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, శ్మశానవాటిక వంటి సమస్యలు తెలిపారు. ఏ నాయకుడూ తమ సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోయారు.

– బొండపల్లి, శృంగవరపుకోట

వితరణ



అందుకున్న టీషర్టులు, షూలతో విద్యార్థులు

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండు టీషర్టులు, షూ, సాక్సులు, నాప్కిన్స్ చొప్పున నాంది ఫౌండేషన్ సభ్యులు శనివారం వితరణ చేశారు. ఎంఈవోలు నాగభూషణం, బాలభాస్కరరావు, ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మిల చేతులమీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు.

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఒబ్బిన సతీష్ తదితర యువకులంతా కలిసి వాటర్‌బాటిళ్లు వితరణ చేశారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన తొలి ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు కూడా అందిస్తామని దాతలు తెలిపారు.

శృంగవరపుకోట: జామి మండలంలోని కుమరాం కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు కేజియా ఫౌండేషన్ నిర్వాహకులు జామెట్రీ బాక్సులు వితరణ చేశారు.

సత్కారం..



విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గరివిడి మండలాధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావును గరివిడిలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనలతో పార్టీని మరింత పటిష్టం చేస్తానని, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, లెంక శ్రీరాములు, ఎలకల అప్పలనాయుడు, ఎడ్ల అప్పారావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పొన్నాడ కుమార్, గుడివాడ తమ్మినాయుడు, కడుమల రాంబాబు, యల్లంటి పోలీస్ నాయుడు, అలమండ అప్పలనాయుడు, పిల్ల అప్పలనాయుడు, రమణ, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

గజపతినగరం: మండలంలోని గజపతినగరం, వెంకటాపురం, గంగచోళ్లపెంట, పురిటిపెంట, మెంటాడ, మర్రివలస, కొనిశ, పత్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, భూదేవిపేట, బంగారమ్మపేట గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కృష్ణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వేతన కష్టాలు

మెరకముడిదాం: మండలంలో సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వేతన కష్టాలు వెంటాడుతున్నాయి. ఫిబ్రవరి నెల వేతనాలు ఇంతవరకూ అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో 2,3 తేదీల్లో వేతనాలు అందేవని, ఇప్పుడు మార్చి15వ తేదీ వచ్చినా అందలేదని ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం



గంట్యాడ: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్




చీపురుపల్లిరూరల్(గరివిడి): కొండపాలేంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వాడవాడలా స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులంతా అందమైన, ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అలాంటప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. అనంతరం గ్రామస్తులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత పలు షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిషేధిత పాలిథిన్ సంచులకు బదులు గుడ్డసంచులు వాడాలని కోరారు.

– గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నెట్‌వర్క్

‘సూర్యఘర్’పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఈఈ రమణ

చీపురుపల్లి: విద్యుత్ వినియోగదారులందరూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన సౌరశక్తిని వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ బి.వి.రమణ కోరారు. చీపురుపల్లి పట్టణంలోని కొత్తగవిడి వీధి కోటదుర్గమ్మ ఆలయం వద్ద సూర్యఘర్ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. మేడలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో సోలార్ విద్యుత్ సదుపాయం పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్ యూనిట్లు కావాలనుకునే వినియోగదారులు నేరుగా విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సూర్య ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు



ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని దుకాణదారుకు సూచిస్తున్న ఎంపీడీఓ, గ్రామ పెద్దలు

మెరకముడిదాం: ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు కోరారు. గర్భాం మేజర్ పంచాయతీలో రామమందిరం వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లు విక్రయించవద్దని గ్రామంలోని దుకాణదారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తాడ్డి వేణుగోపాలరావు, సన్యాసినాయుడు, సర్పంచ్ గాబ్రియల్, గ్రామపెద్దలు టి.చంద్రశేఖర్, సత్తారు శ్రీనివాసరావు, టి.శ్రీధర్, పంచాయతీ ఈఓ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి



గజపతినగరం ఏరియా ఆస్పత్రి, పంచాయతీ స్థలాల్లోని ఆక్రమణలు తొలగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. ఆయా ప్రాంతాలను శనివారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. ఆక్రమణలు జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సంబంధిత అధికారులను నిలదీశారు. అనంతరం 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను మే నెలాఖరుకు పూర్తి చేయాలని, శాఖా గ్రంథాలయం పక్కనే ఉన్న కమ్యూనిటీ హాల్‌ను అన్న క్యాంటీన్ ఏర్పాటుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, ఎంపీడీవో కల్యాణి, డిప్యూటీ తహసీల్దారు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

– గజపతినగరం

ఉత్కంఠభరితం.. ఎడ్లపరుగు పందెం..



వేపాడ మండలం, సోంపురం గ్రామదేవత ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా ఆ గ్రామంలో శనివారం నిర్వహించిన ఎడ్లపరుగు పందెం ఉత్కంఠభరితంగా సాగింది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 15 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొని, పరుగుతీశాయి. ఏ ఎడ్లు మొదట లక్ష్యాన్ని చేరుకుంటాయా అని అంతా ఆసక్తిగా తిలకించారు. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు బహుమతులు అందజేయగా, ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి రూ.20 వేల నగదును బహుమతిగా ప్రదానం చేశారు.

– వేపాడ

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం



వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యమని తహసీల్దారు అరుణకుమారి అన్నారు. శృంగవరపుకోట తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. కార్యాలయానికి పని నిమిత్తం వచ్చే వారంతా ఈ చలివేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రోజురోజుకూ ఎండల తీవ్రత అధికమవుతున్నందున ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాల వద్ద చలివేంద్రాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల నేతలను కోరారు.

– శృంగవరపుకోట

‘పది’ పరీక్షల ఏర్పాట్ల పరిశీలన



పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈవో విమలమ్మ

గజపతినగరం: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈవో విమలమ్మ శనివారం సందర్శించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశారా లేదా అనే అంశాలను ఆమె క్షుణ్నంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పరీక్ష హాల్‌లో గాలి, వెలుతురు వచ్చేలా చూడాలని, ఫ్యాన్లు తిరిగేలా చూడాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు స్థానిక బాలికోన్నత పాఠశాల, బాలురు ఉన్నత పాఠశాల, శ్రీకృష్ణ విద్యాపీఠం, మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో జరగనున్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 60 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు.